ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 26
సంచిక : 140
పేజీలు : 3

బుధవారం, ఫిబ్రవరి 11, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## పోలింగ్ కేంద్ర్రాలకు ఎన్నికల సిబ్బంది

• 31 వార్డులు, 67 కేంద్ర్రాలు




**టీ మీడియా ఫిబ్రవరి 10, ఖమ్మం రూరల్ :** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో జరిగే ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఉదయం 10 గంటలకు హాజరైన పోలింగ్ సిబ్బంది, అధికారులకు సంబంధిత ఎన్నికల అధికారులు దిశా నిర్దేశం చేశారు. అనంతరం పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఆర్వోలకు పోలింగ్ కేంద్రానికి అవసరమైన సిబ్బందిని అందజేయడం జరిగింది. మొత్తం మున్సిపాలిటీ పరిధిలో 32 వార్డులు ఉండగా ఇప్పటికే ఒక వార్డు ఏకగ్రీవం కావడంతో బుధవారం 31

మిగతా 2లో

# నేడు మున్సిపల్ పోల్స్

## సర్వం సిద్ధం : జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్





**టీ మీడియా ఫిబ్రవరి 10, భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా లో నేడు నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 106 వార్డులు ఉండగా, 1,85,348 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇందులో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 60 వార్డులు -- 1,34,775 మంది ఓటర్లు, అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు -- 16,850 మంది ఓటర్లు, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు -- 33,723 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.

పోలింగ్ నిర్వహణ కోసం జిల్లాలో మొత్తం 90 పోలింగ్ లొకేషన్లలో 288 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో 49 సున్నితమైన పోలింగ్ స్టేషన్లను గుర్తించి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టామని, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లు లేవని చెప్పారు. అయితే, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 4 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు.ఎన్నికల నిర్వహణలో ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికార యంత్రాంగం సమన్వయంతో సహకరించి మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విజ్ఞప్తి చేశారు.

**డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి**

జిల్లా కేంద్రం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం పరిశీలించారు. ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని సింగరేణి పాఠశాల ఆవరణలో, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియలు సజావుగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు తదితర ఎన్నికల సామగ్రి క్రమబద్ధంగా అందేలా చూడాలని ఆదేశించారు. ప్రతి బ్యాలెట్ బండిల్‌పై సీల్, అధికారుల సంతకాలు తప్పనిసరిగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లు, ఎన్నికల సామగ్రి సరఫరా వ్యవస్థ, రిసెప్షన్ రూమ్ కార్యకలాపాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు తదితర అన్ని మౌలిక సదుపాయాలు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేదా గందరగోళానికి తావులు లేకుండా, చెక్‌లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని సామగ్రి అందిందా లేదా జాగ్రత్తగా పరిశీలించాలని

మిగతా 3లో




## ఖమ్మం గడ్డపై కాంగ్రెస్

# 'రాక్షస' రాజకీయం

• ఏజెంట్లుగా మారుతున్న అధికారులు

• ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

**టి మీడియా, ఫిబ్రవరి 10,ఖమ్మం:**పది నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న వంచనను, అధికార పార్టీ నేతల అక్రమాలను ఎండగడుతూ బి.ఆర్.ఎస్ పార్టీ నేతలు నేడు ఘాటుగా స్పందించారు. కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధికి, ప్రస్తుత కాంగ్రెస్ అరాచక పాలనకు మధ్య ఉన్న తేడాను గమనించాలని ఎమ్మెల్సి తాత మధుసూదన్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు తాము చేసిన అభివృద్ధిని చెప్పుకోలేక నిస్సహాయ స్థితిలో ఉన్నారని బి.ఆర్.ఎస్ నేతలు విమర్శించారు. ఓటమి భయంతో పోలీసు మరియు రెవెన్యూ యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని బి.ఆర్.ఎస్ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రాత్రికి రాత్రే ప్రలోభాలకు గురిచేస్తూ నాయకులను పార్టీలో చేర్చుకోవడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు.రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన ఒక మంత్రి, "ఓటు వేయకపోతే బొక్కలో వేస్తాం" అంటూ ఓటర్లను, ప్రతిపక్ష నేతలను బహిరంగంగా బెదిరించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని విమర్శించారు. "ఇదేనా మీరు నేర్చుకున్న సంస్కృతి?" అని మంత్రులను నిలదీశారు.గతంలో కేసీఆర్ గారి కేబినెట్‌లో పనిచేసిన మంత్రులు నేడు వ్యవస్థలు ధ్వంసమయ్యాయని మాట్లాడటం హాస్యాస్పదమని పేర్కొన్నారు.అనాడు భక్త రామదాసు ప్రాజెక్టు కట్టింది మీరు కాదా? అప్పుడు వ్యవస్థలు పని చేయలేదా?" అని ప్రశ్నించారు. పాలేరులో మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి గారు తెచ్చిన జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్, నర్సింగ్ కాలేజీలకు ఇప్పుడు రిబ్బన్లు కట్ చేయడం తప్ప, ఈ మంత్రులు జిల్లాకు కొత్తగా తెచ్చింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ

మిగతా 3లో

## 20 వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు

• జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**టీ మీడియా ఫిబ్రవరి 10, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :** జిల్లా లోని పత్తి రైతులందరూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025--26 సీజన్‌కు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా జిల్లాలో పత్తి కొనుగోళ్లు కొనసాగుతున్నట్లు తెలిపారు.జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ఈ నెల 20 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల రైతులు తమ పత్తిని సమీపంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని కోరారు.సీసీఐ ద్వారా ఇప్పటికే కొనుగోలు చేసిన పత్తికి సంబంధించి రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ కావడంలో కొంత ఆలస్యం జరిగిన విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ చెల్లింపులు త్వరితగతిన రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. మిగిలిన కాలవ్యవధిని రైతులు సద్వినియోగం చేసుకొని తమ పత్తిని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు.

# ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది

• బాధ్యులపై ఉక్కుపాదం తప్పదు

**టి మీడియా, ఫిబ్రవరి 10, ఖమ్మం :** రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలోనే కాకుండా ప్రస్తుతం కూడా రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కొనసాగుతోందని, దీనిపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని వెల్లడించారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ట్యాపింగ్ కోసం ఎక్కడెక్కడ ఎక్విప్‌మెంట్ (పరికరాలు) అమర్చారో ప్రభుత్వం ఇప్పటికే ఆరా తీస్తోందని, విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగిస్తే వదిలిపెట్టం**

ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, జరుగుతోందని అనేక మంది గగ్గోలు పెడుతున్నారు.. ఇది అక్షరాలా నిజం. ఇప్పుడు కూడా కొందరు ఈ అ ( ర ్ వ ా ల ర ్ ు పాల్పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఎంక్వయిరీ చేస్తోంది. ఎవరు సూత్రధారులు? ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారు? అనేది బయటకు తీస్తాం. చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని మంత్రి స్పష్టం చేశారు.



ఉద్యోగులను ఓట్లు అడగడంలో తప్పేముందని, తన పార్టీ తరపున తాను అడిగానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**మున్సిపల్ ఎన్నికల్లో 80 శాతం పైగా సీట్లు కాంగ్రెస్ వే**

రేపు (బుధవారం) జరగనున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. "గడిచిన రెండేళ్లలో మేం చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకుని ప్రజలకు చేరువయ్యాం. అందుకే ఈ పుర ఎన్నికల్లో 80 శాతానికి పైగా స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోబోతోంది. ఇది జీర్ణించుకోలేకే ప్రతిపక్ష నాయకులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.

మిగతా 2లో

## నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

**-ఎస్పీ రోహిత్ రాజు**



**టీ మీడియా ఫిబ్రవరి 10, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలోని కొత్తగూడెం కార్పొరేషన్, ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలకు బుధవారం జరగనున్న పోలింగ్ నేపథ్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఇందులో భాగంగా పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల నందు ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. అక్కడ విధులలో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద 1200 మందితో భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలలో నిరంతర నిఘా కొరకు ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రమైన పాల్వంచ అనుబోస్ కళాశాల పరిసర ప్రాంతాలను డాగ్స్ స్క్వాడ్, బాంబుస్క్వాడ్ తో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.



## పైప్‌లైన్ పేరిట ఇష్టానుసారంగా రోడ్డు తవ్వకాలు

**టీ మీడియా ఫిబ్రవరి 10, రుద్రంపూర్ :** సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్‌లో పైప్‌లైన్ పనుల పేరిట ఇష్టానుసారంగా రోడ్లను తవ్వడంపై కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంకటేశ్ ఖని ఓపెన్‌కాస్ట్ విస్తరణలో భాగంగా ప్రస్తుతం రుద్రంపూర్‌లో ఉన్న ఫిల్టర్ బెడ్‌ను భవిష్యత్‌లో తొలగించనున్న నేపథ్యంలో గౌతంపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్‌కు నీటి సరఫరా చేసేందుకు పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనుల్లో భాగంగా రుద్రంపూర్ నుండి గౌతంపూర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డును, ముఖ్యంగా రుద్రంపూర్ జడ్పీ స్కూల్ ప్రాంతం నుండి ఎటువంటి ముందస్తు ప్రణాళిక లేకుండా ఇష్టానుసారంగా తవ్వుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికే కార్మిక ప్రాంతంలో రోడ్ల అభివృద్ధి జరగక సంవత్సరాలు గడిచిపోయిన పరిస్థితిలో ఉన్న కొద్దిపాటి రోడ్లను కూడా ఇలా తవ్వడం వల్ల భవిష్యత్‌లో సింగరేణి యాజమాన్యం రోడ్లు పునర్నిర్మిస్తుందా అనే అనుమానాలు కార్మికుల్లో వ్యక్తమవుతున్నాయి. పైప్‌లైన్ నిర్మాణం అవసరమైనప్పటికీ, రోడ్లకు నష్టం కలగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని, తవ్విన రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి బాధ్యతాయుతంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## సమస్త ప్రజల హక్కులపై మోడీ ప్రభుత్వదాడి

### సార్వత్రిక సమ్మెతో బుద్ధి చెప్పుదాం - వామపక్ష ప్రజాసంఘాలు




**టీ మీడియా,ఫిబ్రవరి10, సింగరేణి (కారేపల్లి):** దేశంలోని సమస్త ప్రజల హక్కులపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దాడి చేస్తుందని సింగరేణి మండల సీఐటీయు కార్యదర్శి కే.నరేంద్ర, ఖమ్మం జిల్లా ఏఐకేఎంఎస్ కార్యదర్శి వై.ప్రకాశ్,పీవైఎల్ రాష్ట్ర నాయకులు భూక్యా శివనాయక్‌లు అన్నారు. ఈనెల 12న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయటానికి కార్యచరణపై వామపక్షాల ప్రజాసంఘాల నాయకులు సోమవారం కారేపల్లిలోని భాగం రామనర్సయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో వారు మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్ బిల్లులుగా తీసుకువచ్చి కార్మికులను వెట్టిలోకి నెట్టివేసిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేదలకు ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును వీబీజి రామ్ జీ బిల్లు మార్చి ఉపాధిని దూరం చేస్తుందన్నారు. రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులుఏడాది పాటు పోరాట ఫలితంగా క్షమాపణలు చెప్పిన ప్రధాని మోడీ రైతుకు కనీసం మద్దతు ధర చట్టం తీసుకొస్తానని హామీ ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. కార్మిక, కర్షక రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12వ తేదిన జరగనున్న సార్వత్రిక సమ్మెను సింగరేణి మండలంలో ఉన్న అన్ని రంగాల కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా జయప్రదం చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎం జిల్లా నాయకులు గుగులోత్ తేజా, ఏఐకేఎంఎస్ ఖమ్మం డివిజన్ నాయకులు దారావత్ సక్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విధులకు హాజరుకండి

**-- -జీఎం శాలెం రాజు**



**టీ మీడియా ఫిబ్రవరి 10, రుద్రంపూర్ :** ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపులో కొంత వెనకబడి ఉన్నందున ఈ ఫిబ్రవరి, మార్చి నెలలు ఈ ఆర్థిక సంవత్సరం చివరి దశ నెలలు, ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకొనుటకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, అప్పుడే నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటామని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలెం రాజు అన్నారు. మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఈ నెల 12న తలపెట్టిన ఒక రోజు దేశ వ్యాప్త సమ్మెకు సంబందించి నిర్వహించిన సమీక్షలో భాగంగా కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలెం రాజు సమ్మెలో పాల్గొనవద్దని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కొన్ని జాతీయ కార్మిక సంఘాలు వివిధ డిమాండ్లతో ఈ 12వ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిస్తూ, అందులో భాగంగా మన సింగరేణిలో కూడా ఒకరోజు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో గమనించవలసిన విషయం ఏమిటంటే ఈ సమ్మె డిమాండ్లలో అత్యధికం సింగరేణి కార్మికులకు మాత్రమే సంబంధించినవి కావని, సింగరేణి యాజమాన్యం తీర్చగలిగేవి కూడా కావన్నారు.సింగరేణి సంస్థ పరిధిలోని సమస్యలు ఏమైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. అటువంటప్పుడు మన కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనాల్సిన అవసరం లేదన్నారు. వివిధ కారణాల వల్ల వానాకాలంలో వర్షాల ప్రభావం వల్ల ఓపెన్ కాస్ట్ మైన్ లలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగిన విషయం తెలిసిందే అన్నారు. ఈ సమయంలో లక్ష్య సాధనకు ప్రతిరోజు సాధించే ఉత్పత్తి ఎంతో తోడ్పడుతుందన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరగడానికి బొగ్గు అవసరం కాబట్టి మన ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించుటలో కృషి చేస్తూ ఒకరోజు సమ్మెలో పాల్గొనకుండా విధులకు హాజరు కావాలని ఆయన కోరారు.



## వ్యాపారాల కు అడ్డ, నేషనల్ హైవే గడ్డ

**టీ మీడియా ,ఫిబ్రవరి 10, భూర్గంపాడు :** భూర్గంపాడు మండలం సారపాక నుండి భద్రాచలం వెళ్ళు మార్గంలో, నేషనల్ హైవే రహదారి వెంట దుకాణాలు వెలుస్తున్నాయి. ఈ దుకాణాల వలన ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులు అని,గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా దుకాణాలు పెడతున్నారా..? లేక పంచాయతీ అనుమతులు ఉన్నాయా..? గ్రామపంచాయతీ అనుమతి అవసరం లేదా...? అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే నేషనల్ హైవే ఇరువైపులా ఆక్రమణలు జరిగాయి అని, అదే దారిలో కుప్పలు కుప్పలుగా చేపల దుకాణాలు వెలిసాయి అని, చేపల వ్యాపారం వలన వచ్చే వాహన దారులు బండ్లు నిలపడం వలన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి అని, ఇప్పుడు వీటిపై చర్యలు తీసుకోక పోతే రాబోయే రోజుల్లో మరిన్ని ఆక్రమణలు జరిగే అవకాశాలు ఉన్నాయి అని స్థానికులు మండి పడుతున్నారు. నేషనల్ హైవే ఆక్రమణాలకు అడ్డగా మారక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి అని స్థానికులు కోరుతున్నారు.



## సమ్మెనోటీస్ ఇచ్చిన జీపీ కార్మికులు

**టీ మీడియా,ఫిబ్రవరి10,సింగరేణి(కారేపల్లి):** కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్‌లు తెచ్చి శ్రామికుల శ్రమను దోచుకోవటానికి హక్కులు కల్పించటాన్ని నిరసిస్తూ, గ్రామపంచాయతీ వర్కర్లకు గ్రీన్ చానల్ ద్వారా జీతాలు ఇవ్వాలని, జీపీ సిబ్బందిని 2వ పీఆర్సీ పరిధిలోనికి తీసుకరావాలని, జీవో నెం 51 సవరించి పల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌తో ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు సింగరేణి మండల జీపీ కార్మికులు సోమవారం ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్‌కు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈసందర్భంగా సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర మాట్లాడుతూ జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్య కల్పించాలని డిమాండ్ చేశారు. జీపీ కార్మికులతో పాలకులు వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని కనీస వేతనం రూ.26 వేలు చేయాలన్నారు. పాలకుల చర్యలపై ప్రతిఘటనతో దారికొస్తారన్నారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జీపీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి శాదరాసిపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు బోళ్ల కొమరయ్య, సహాయ కార్యదర్శి ఆదెర్ల గౌతమ్, కోశాధికారి శ్రీను, నాయకులు ఆదార్ల శ్రీను, తిరపయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## బ్యాంకింగ్ అవగాహన సదస్సు

**టీ మీడియా ,ఫిబ్రవరి 10, ముదిగొండ** :నాబార్డ్ సౌజన్యంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ముదిగొండ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించేందుకు ముత్తారం గ్రామంలో 'కళాజాతర' కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్యాంక్ మేనేజర్ జ్ఞాన సుమ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ సుమ మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన : రూ. 436/- ప్రీమియంతో 200000 బీమా రక్షణ, మరియు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన : కేవలం రూ. 20/- లకే 200000 ప్రమాద బీమా సౌకర్యం, ఇన్సూరెన్స్: రూ. 2000/- ప్రీమియంతో పాలసీ తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే, వారి నామినీకి రూ. 40,00,000/- అందుతుందని వివరించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, ఖాతాదారులు తాము తీసుకున్న అప్పులను సకాలంలో చెల్లించి వివిధరకములైన రాయితీలను పొందాలని , బ్యాంకుతో సత్సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ బ్యాంక్ ఖాతాలకు క్షువ-నివిషి / జ-నివిషి చేయించుకోవాలని కోరారు. సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త: ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అడిగితే ఓటిపి లు లేదా వ్యక్తిగత వివరాలు చెప్పకూడదని ప్రజలను అప్రమత్తం చేశారు. కళాకారులు తమ ఆటపాటలతో బ్యాంకింగ్ మోసాలు ,పథకాలపై ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ భాను ప్రకాష్, బ్యాంకు సిబ్బంది, గ్రామ సర్పంచ్ మమత, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విసిరిన సవాళ్లను ప్రజలు తిప్పికొట్టారు.. అదే ఫలితం రేపు పునరావృతం కాబోతుంది" అని అన్నారు.

**అభివృద్ధికి పెద్ద పీట**

గత ప్రభుత్వ తీరుపై పొంగులేటి తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ధనిక తెలంగాణను రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. నెలకు రూ. 6,300 కోట్లు కేవలం అప్పులకే కడుతూ కూడా సంక్షేమాన్ని ఆపలేదు. గత దొరల పాలనలో పేదలను విస్మరించారు. 62 వేల డబుల్ బెడ్ రూంలను మొండిగోడలుగా మిగిల్చారు. కానీ మేం 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 'వరి వేస్తే ఉరి' అన్న కాలం పోయి, ఇప్పుడు వడ్లకు బోనస్ ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం" అని వివరించారు. మాజీ మంత్రుల అసభ్య పదజాలానికి ప్రజలు ఓటు ద్వారానే తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు.

## పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది

వార్డుల్లో పోలింగ్ జరగనుంది.ఓటర్ల సంఖ్యను ఆధారంగా 67 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకుగాను 12 మంది జోనల్ ఆఫీసర్లతో పాటు ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ఆర్ఓ, ఏఆర్ఓ కలిపి ఏడుగురు అధికారులు పోలింగ్ బాధ్యత నిర్వహించనున్నారు. మంగళవారం భోజన విరామం తర్వాత 12 జోన్లకు సంబంధించిన బస్సుల్లో పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల అధికారి నవీన్ బాబు, రూరల్ తాసీల్దార్ రాంప్రసాద్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ పాల్గొన్నారు.



## స్వేచయుత ఎన్నికలు

**-పోలిష్ కమిషనర్ సునీల్ దత్**

**టి మీడియా, ఫీబ్రవరి 10, ఖమ్మం రూరల్:** ఏదలాపురం మున్సిపాలిటీ లో జరిగే ఎన్నికలను స్వేచయుత వాతావరణం జరిగేట్లు చూడాల్సిన బాధ్యత మీ పై ఉందని సిబంధికి పోలిష్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు, ఫిబ్రవరి 11 న జరిగే ఏదులపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో శాంతి భద్రత అంశాలు పాటించాల్సిన విధివిధానాల పై ఖమ్మం రూరల్ పోలీసు స్టేషన్ లో ఏర్పాటు చేసినా కార్యక్రమంలో సీపీ పాల్గొని మాట్లడారు , ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణ కు లోబడి పనిచేయాలి అని చూపించారు, ఎన్నికల పక్రియ ముగిసేంతవరకు శాంతి భద్రతా పొరపాట్లు జరగకుంట చూసుకోలి అని చెప్పడం జరిగింది, ఏన్నికల నియమాలలో కఠినం గా ఉండాలి, అప్పగించిన బాధ్యతను సమర్ధవంతం గా నిర్వహించాలి అని పోలింగ్ కేంద్రంలనీ వదిలి వెళ్ళొద్దని చూపించారు , ఎన్నికల్లో మద్యం డబ్బు ప్రభావాన్ని నియంత్రించేందుకు ఎన్నికల సంఘం కఠినం చర్యలు తీసుకుంటుంది అని ఏదులపురం లో జరిగే 31 వార్డు గాను ఎలక్షన్ కమిషన్ 67 కేంద్రాలను ఏర్పాటు చేశారు ,ఎలక్షన్స్ జరుగు వార్డులు: 31ప్రతి పోలింగ్ స్టేషన్ కి ఎలక్షన్ స్టాప్: 5 మరియు బిఎల్ఓ: 1ఎలక్షన్స్ రూట్లు 12 ఏర్పాట్ చేశారు అని వ్యాఖ్యానించారు.

## గండ్లూరి నర్సు బాయమ్మకు నివాళులర్పించిన పి. సుదర్శన్ రావు



**టీ మీడియా ఫిబ్రవరి 10, ఖమ్మం** :అమరజీవి గండ్లూరి కిషన్ రావు సతీమణి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు బాణాపురం మాజీ సర్పంచ్ కామ్రేడ్ గండ్లూరి నర్సు బాయమ్మ పార్థివ దేహాన్ని, మంగళవారం ఖమ్మం లోని వారి స్వగృహం మామిళ్ల గూడెంలోని ఇంటి కి వెళ్లి సందర్శించి నివాళు లర్పించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి సుదర్శనరావు, ఖమ్మం తాలూకా కమ్యూనిస్టు యోధుడు వీర తెలంగాణ రైతాంగ పోరాటయోధుడు గండ్లూరి కిషన్ రావు బాణాపురం ఏరియాలో పేద ప్రజల పక్షాన కూలి రేట్లు పెంపుదల కోసం కుండ కొలతల్లో తేడాకు వ్యతిరేకంగా పోరాడినటువంటి నాయకుడు ప్రజల పక్షాన రైతుల పక్షాన నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నటువంటి నాయకుడిగా భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన నాయకుడిగా ఖమ్మం తాలూకాలో కమ్యూనిస్టు నాయకుడిగా గుర్తింపు పొందిన కామ్రేడ్ గండ్లూరి కిషన్ రావు భూస్వాములు అత్యంత దారుణంగా సర్పంచ్ గా ఉన్న సమయంలోనే చంపి వేయడం జరిగింది.ఆ తర్వాత సర్పంచిగా కామ్రేడ్ గండ్లూరి నర్సుబాయమ్మ తన భర్త ఏ ప్రజల కోసం అయితే పోరాడిండు ఆ ప్రజల పక్షాన పని చేస్తూ ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకుపోవటంలో ముందు భాగాన నిలిచారు అగ్రకులంలో పుట్టినప్పటికీ పేదల పక్షాన పని చేసినటువంటి వ్యక్తి గండ్లూరి నర్సుబాయమ్మ ఆమెకు సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున వారి మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ నివాళులర్పించారు. ఆయన తో పాటు నివాళులర్పించిన వారిలో సిపిఎం 2 టౌన్ నాయకులుఎస్ కే ఫకీర్ సాబ్ , సిహెచ్ వీరభద్రం, షఫీ, సుభాష్,తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

# లడ్డుపై ఈవో సానుకూల స్పందన

**టీ మీడియా, ఫిబ్రవరి 10, భద్రాచలం టౌన్ :** భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయం లో భక్తులకు మహా ప్రసాదం గా అందించే ప్రసిద్ధ లడ్డు రుచి గురించి కొంత మంది భక్తులు అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం హిందూ సంస్థల దృష్టి కి రాగా, అక్కడి కి వెళ్ళి నిర్వహణ అధికారులకు తమ సూచనలను అందజేశారు. ఈ లడ్డు భక్తులకు ఎప్పటి నుంచో ప్రీతీ కరమైనది, మహా ప్రసాదం అని, కానీ లడ్డు రుచి, నాణ్యత గురించి భక్తులు, హిందూ సంఘాలు ఆలయ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం లో పరశురాం పరివార్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్, విశ్వ హిందూ పరిషత్ జిల్లా మీడియా ప్రముఖ్ జాస్తి శివరాం ఈ విషయంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కే. దామోదర రావు ను కలిశారు. భక్తుల ఫిర్యాదులను వివరంగా వారికి తెలియజేశారు. ఆలయ ఈవో కె.దామోదర్ రావు ఈ సమస్యలను శ్రద్ధగా విని, అత్యంత సానుకూలంగా మాట్లాడి భక్తుల సూచనలను స్వాగతించారు. లడ్డు తయారీలో ఏ లోపాలు ఉంటే అవి త్వరగా గుర్తించి సరి చేస్తామని హృదయపూర్వకంగా హామీ ఇచ్చారు. భక్తుల సంతోషానికి, ఆలయ ప్రసాద నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టంగా తెలిపారు. ఈవో ఈ స్పందన భక్తులలో ఆశాకిరణాలను నింపింది. అంతే కాకుండా, ఆలయ చుట్టూ ప్రాంగణంలో దుకాణాల నిర్వహణ గురించి కూడా చర్చించారు. అన్యమతస్తులు దుకాణాలు నడుపుతున్నారనే ఆక్షేపాలను ఈవో దృష్టి కి తీసుకు వెళ్ళగా, ఆలయ పవిత్రత, భక్తుల సౌకర్యాలు కాపాడేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కే. దామోదర రావు కు పని మీద ఉన్న అంకితభావం వలన భక్తుల సమస్యలకు వెంటనే స్పందించారు అని, హిందూ



సంఘాలు, భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేసారు.

# పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది






**31 వార్డులు, 67 కేంద్రాలు**

**టీ మీడియా ఫిబ్రవరి 10, ఖమ్మం రూరల్ :** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో జరిగే ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఉదయం 10 గంటలకు హాజరైన పోలింగ్ సిబ్బంది, అధికారులకు సంబంధిత ఎన్నికల అధికారులు దిశా నిర్దేశం చేశారు. అనంతరం పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఆర్వోలకు పోలింగ్ కేంద్రానికి అవసరమైన సిబ్బందిని అందజేయడం జరిగింది. మొత్తం మున్సిపాలిటీ పరిధిలో 32 వార్డులు ఉండగా ఇప్పటికే ఒక వార్డు ఏకగ్రీవం కావడంతో బుధవారం 31 వార్డుల్లో పోలింగ్ జరగనుంది.ఓటర్ల సంఖ్యను ఆధారంగా 67 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకుగాను 12 మంది జోనల్ ఆఫీసర్లతో పాటు ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ఆర్ఓ, ఏఆర్ఓ కలిపి ఏడుగురు అధికారులు పోలింగ్ బాధ్యత నిర్వహించనున్నారు. మంగళవారం భోజన విరామం తర్వాత 12 జోన్లకు సంబంధించిన బస్సుల్లో పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల అధికారి నవీన్ బాబు, రూరల్ తాసీల్దార్ రాంప్రసాద్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ పాల్గొన్నారు.

## 12 న జరిగే సార్వత్రిక సమ్మెకుమద్దతు

**-సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా**



**టీ మీడియా ఫిబ్రవరి 10, ఖమ్మం :** ఫిబ్రవరి 12న తేదీన జరుగుతున్న సార్వత్రిక సమ్మెకు సిపిఐ ఎం సంపూర్ణంగా మద్దతు తెలుపు తుందని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సిపిఎం పార్టీ సభ్యులు, సానుభూతి పరులు, నాయకులు, కార్యకర్తలు అందరూ సమ్మె విజయవంతం కావటానికి క్రియాశీలకంగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో దేశం లోని 25 కోట్ల మందికి పైగా సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, ఉద్యోగులు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. రైతులు, కూలీలు చిరు వ్యాపారులు, సమస్త శ్రామిక లోకం మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఈ సమ్మె కార్మికుల జీతభత్యాల కోసం కాదని, దేశం కోసం, దేశ భవిష్యత్తు కోసం అన్నారు. కేంద్రంలోని ఆర్ఎస్ఎస్ ప్రయోజిత, మతోన్మాద బీజేపీ ప్రభుత్వం సకల సంపదలను కార్పొరేట్లకు దోచి పెడుతుంది. అమెరికా, ఐరోపా సామ్రాజ్యవాదులకు,దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతుందని, మరోవైపున 4 లేబర్ కోడ్ లను పేరుతో 100 సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కు లను రద్దు చేసింది.కార్మికుల గొంతు నొక్కి, వాళ్ళ చేతులకు సంకెళ్లు వేసి పెట్టుబడిదారులకు కట్టు బానిసలుగా మారుస్తుంది. ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి 25 కోట్ల మంది పేదల పొట్ట కొట్టింది. విద్యుత్ చట్టాన్ని సవరించి రైతులు, పేదల జీవితాలను ఆగం చేసింది. ఎల్ఐసిని ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు దోచిపెడుతుంది. అమెరికాకు లొంగిపోయి, ట్రంప్ కు భయపడి, మన వ్యవసాయ రంగానికి ఉరితాడు పేనుతుంది. దేశానికి ద్రోహం చేస్తున్నమోడీ ప్రభుత్వంపై సమ్మెతో సమ్మెట దెబ్బ వేయాలని నున్నా పిలుగునిచ్చారు.

## ఖమ్మం గడ్డపై కాంగ్రెస్

పేరుతో ప్రజలను మభ్యపెడుతూ మధిర పట్టణాన్ని 'మినీ సింగపూర్' చేస్తామన్న మాటలు కోటలు దాటుతున్నాయి కానీ, క్షేత్రస్థాయిలో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. అసమర్థ పాలనను కప్పిపుచ్చుకోవడానికి అబద్ధపు హామీలతో కాలం వెళ్లదీస్తున్నారు.రెవెన్యూ మంత్రి స్వయంగా ఉద్యోగ సంఘాల నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, వార్డుల వారీగా ఓట్ల సమీక్ష చేయడంపై బి.ఆర్.ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ కాంగ్రెస్ ఏజెంట్లుగా మారుతున్న అధికారులపై జిల్లా కలెక్టర్ కు మరియు ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తున్నట్లు ప్రకటించారు. అటువంటి అధికారులను వెంటనే ఎన్నికల విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.ప్రజాబలం ముందు పోలీసు బలగం పనిచేయదు. డబ్బుతో కొనుగోలు చేసి గెలవాలని చూస్తున్న కాంగ్రెస్ కు ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.
ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపాలిటీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బుల్, మైనారిటీ జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్, ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, నాయకులు ముత్యాల వెంకటప్పారావు, బలుసు మురళీకృష్ణ, బంక మల్లయ్య, పగడాల నరేందర్, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

## నేడు మున్సిపల్ పోల్స్

కలెక్టర్ హెచ్చరించారు. సిబ్బంది నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులకు అప్పగించారు. అలాగే పోలింగ్ సామాగ, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్లను తరలించే సమయంలో సాయుధ పోలీసు బందోబస్తు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తిన సందర్భంలో వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.
ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో సంబంధిత ఎన్నికల అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.